క్లుప్తంగా

సిపాయి భరోసా కిట్ పంపిణీ



కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట (ఏర్పేడు) : ఏర్పేడు మండలం పాత వీరాపురంలో గురువారం సిపాయి భరోసా కిట్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పంపిణీ చేశారు. పాతవీరాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాతగుంట సాంబశివారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తనవంతు సాయంగా నిత్యావసర వస్తువులతో కూడిన కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, మునికృష్ణమోహన్‌రెడ్డి, గురవారెడ్డి, హరిదాస్‌రెడ్డి, జమున, తిరుపాల్‌రెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సురేష్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికీ అవగాహన అవసరమని యోగా గురువు సురేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం చిన్నిపాలేడులో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరిగి తద్వారా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో ఆరోగ్యం దెబ్బతింటుందని, భూమిలో భూసారం నాశనం అవుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కాశిబాబు, చలపతి, సుధాకర్‌నాయుడు, రాగప్పనాయుడు, సురేంద్ర, జయరామనాయుడు పాల్గొన్నారు.

55 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



హాజరైన వైద్య సిబ్బంది

నాగలాపురం : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని నాగలాపురం-1, 3, విలేజ్ హెల్త్ సెంటర్లలో వైద్యాధికారి విజయ్‌కుమార్ అధ్యక్షతన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు 55 మందికి రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో ఓ మహిళకు క్యాన్సర్ లక్షణాలు బయట పడడంతో తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేసినట్లు వైద్యాధికారి విజయ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్ కుమార్, చిరంజీవి, ధనరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ వనజాక్షి, ఫీబేఫోనియానా, దైవాని, చిత్ర, కుమారి, జాన్సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వృథా చేయొద్దు



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వృథా చేయవద్దని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం కారణి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల్లో మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని కోడిగుడ్లు, బియ్యం, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త మంజుల, రమణయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు

శ్రీకాళహస్తి : క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏఏవో, ఈఆర్వో నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల బిల్లులో క్యూఆర్ కోడ్ ఇవ్వడం జరిగిందని దీని ద్వారా నేరుగా ఫోన్‌పే, జీపే, పేటీయం యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు.

శత సంకల్పం



నాగలాపురం జూనియర్ కళాశాల స్టడీ అవర్‌లో విద్యార్థులు



వరదయ్యపాళెం కళాశాలలో డిజిటల్ బోర్డుపై శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించే దిశగా ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్ 1 నుంచి సంకల్ప్-2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కళాశాల సమయాన్ని పెంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉన్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో 4 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 297 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 336 మంది ఉన్నారు. వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేసి తర్ఫీదు ఇస్తున్నారు.

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఏ,బీ,సీ కేటగిరీలుగా విద్యార్థుల విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ

వరదయ్యపాళెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతులు ఉండేవి. గతేడాది డిసెంబర్ 1వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు పెట్టి సాధన చేయిస్తున్నారు. అన్నీ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన వారు మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మార్కుల ఆధారంగా..

త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారిని సీ కేటగిరిగా విభజించారు. వీరి కోసం ఇంటర్ బోర్డు ప్రతి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అన్ని గ్రూపులకు సంబంధించిన ప్రశ్నలనిధి బుక్‌ను సరఫరా చేసింది. వెనుకబడిన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇచ్చేందుకు జూనియర్ అధ్యాపకులను కేర్ టేకర్లుగా నియమించారు. కేర్ టేకర్లు వారికి కేటాయించిన విద్యార్థులను ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధన చేయిస్తున్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో ఇంటర్ విద్యార్థుల వివరాలు ఇలా..

మండలం	ప్రథమ సంవత్సరం	ద్వితీయ సంవత్సరం
సత్యవేడు	81	82
వరదయ్యపాళెం	69	74
పిచ్చాటూరు	32	64
నాగలాపురం	115	116

వెనుకబడినవారికి శిక్షణ



మా కళాశాలలో నిర్వహించే ప్రత్యేక స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు చదివించడంతో పాటు చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. దీని వల్ల విద్యార్థులు మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

- శిరీష, సీనియర్ ఇంటర్ విద్యార్థిని, వరదయ్యపాళెం జూనియర్ కళాశాల

సందేహాలు నివృత్తి చేస్తున్నాం



కళాశాలలో అర్థం కాని సబ్జెక్టు విషయాలను ప్రత్యేక తరగతుల్లో అధ్యాపకులను అడిగి తెలుసుకుంటున్నాం. ఒకటి, రెండు సార్లు వినడం వల్ల బాగా అర్థం అవుతోంది. స్టడీ అవర్స్‌తో ఎంతో మంచి జరుగుతోంది. చాలా సంతోషంగా ఉంది.

- లక్ష్మి, సీనియర్ ఎంపీసీ విద్యార్థిని, నాగలాపురం జూనియర్ కళాశాల

సమయం ఆదా అవుతోంది



ప్రత్యేక స్టడీ అవర్స్‌లో అధ్యాపకులు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. సబ్జెక్టులు రాయించడంతో పాటు సందేహాలు నివృత్తి చేస్తున్నారు. మాకు పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ సమయం వృథా కాకుండా ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

- వెంకటేష్, సీనియర్ ఇంటర్ విద్యార్థి, వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల

కేర్ టేకర్స్‌తో పర్యవేక్షణ



కళాశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సంకల్ప్-2025లో భాగంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా సీ గ్రూపు విద్యార్థులపై దృష్టి సారించాం. ఏ రోజు విద్యార్థులు తరగతులకు రాకుంటే కేర్ టేకర్స్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇస్తారు.

- పద్మావతి, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరదయ్యపాళెం

తాగి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్

శ్రీకాళహస్తి : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 35 మంది పట్టుబడగా వారిని గురువారం డీఎస్పీ నరసింహమూర్తి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలను వివరించారు. మరోసారి పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

శ్రీకాళహస్తి : భవానీ దీక్ష భక్తులకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు కేటాయిస్తున్నట్లు డిపో మేనేజర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భవానీ దీక్ష తీసుకున్న భక్తులు విజయవాడ, మేల్‌మరవత్తూరు ప్యాకేజీగా ధనుర్మాసం పురస్కరించుకుని అద్దెకు బస్సులు కేటాయిస్తున్నట్లు చెప్పారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ : గ్రామ సచివాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు వేయాలని స్థానికులు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు విన్నవించారు. గ్రామంలోని పలు మట్టి వీధులు వర్షం పడితే నడవలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కాలువలు లేకపోవడంతో మురుగు వీధుల్లో ప్రవహిస్తోందని, పలుచోట్ల వీధిలైట్లు వెలగకపోవటంతో రాత్రిళ్లు అంధకారంలో నివసిస్తున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

బాలకృష్ణాపురం మడుగుపై వంతెన నిర్మించాలి

సత్యవేడు : బాలకృష్ణాపురం మడుగుపై వంతెన నిర్మించాలని సర్పంచ్ ఇందుమతి రెవెన్యూ అధికారులకు విన్నవించారు. గురువారం మండలంలో బాలకృష్ణాపురం పంచాయతీలోని పాఠశాల ప్రాంగణంలో రెవెన్యూ సదస్సు సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షాలు పడినప్పుడు మడుగు ఉధృతంగా ఎల్లువగా ప్రవహించడంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 25 మంది పక్కా గృహాలు మంజూరు చేయాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేష్, వీఆర్‌ఓ సురేష్, సెక్రటరీ సునీల్ కుమార్ , సర్వేయర్ గిరి , గ్రామస్థులు పాల్గొన్నారు.

తులసిముని కుటుంబానికి పరామర్శ



తులసిమునికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి చెంగారెడ్డి

నారాయణవనం : వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఉప సర్పంచ్ తులసిమునికి గురువారం పలువురు నివాళి అర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ తులసిముని (90) బుధవారం మృతిచెందారు. గురువారం ఉదయం మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారయాలు, నాయకులు కిరణ్, హైకోర్ట్ మాజీ జడ్జి దొరస్వామి తులసిముని నివాసానికి చేరుకుని పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి చిత్తశుద్ధిగా పనిచేసిన నిస్వార్థ కార్యకర్త తులసిముని అని నేటి తరం నాయకులకు ఆయన ఆదర్శమని చెంగారెడ్డి పేర్కొన్నారు.

పేద ముస్లింలకు చేయూత



పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు

వరదయ్యపాళెం : మండలానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ షేక్ బాబు నూరుద్దీన్ సహకారంతో ముస్లింపాళెం, గౌసియానగర్, సీఎల్‌ఎన్‌పల్లి, రాజీవ్‌నగర్ గ్రామాల్లోని 130 పేద ముస్లిం కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో గోధుమ పిండి, ఆయిల్ ప్యాకెట్, కూరగాయలను వితరణగా అందజేశారు. స్థానికంగా ఉన్న మైనారిటీ సెల్ నాయకుడు షేక్ అబ్దుల్ ఇటీవల వర్షాలకు ముస్లిం పేద కుటుంబాల ఇబ్బందులను ఎన్‌ఆర్‌ఐ షేక్ బాబు నూరుద్దీన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన గురువారం 130 కుటుంబాలకు సరుకులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రసూల్ సాహెబ్, చాంద్ భాషా, అఫీజ్, ఫరూక్, అబూబకర్, ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : గుర్తుతెలియని కారు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్య, భర్త, రెండేళ్ల కుమార్తె గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం బాధితుడు రేణిగుంట పోలీసులకు రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న భగవాన్, భార్య శ్రావణి, కుమార్తె హేమశ్రీతో కలిసి స్కూటీపై గుడికి వెళ్లేందుకు బుధవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి నుంచి రేణిగుంట వైపు వస్తుండగా మల్లవరం సమీపంలో గుర్తుతెలియని కారు ఢీ కొట్టింది. కారు డ్రైవర్ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోవడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సహాయంతో తిరుపతిలోని ప్రవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. గుర్తు తెలియని కారు డ్రైవర్‌ని కనిపెట్టి తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను కోరారు.

ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

శ్రీకాళహస్తి : ప్రయాణికులతో ఆటో డ్రైవర్లు మర్యాద పూర్వకంగా మెలగాలని రెండో పట్టణ పోలీసులు సూచించారు. గురువారం ఆర్టీసీ బస్టాండులోని ఆటో డ్రైవర్లకు రెండో పట్టణ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్సు, ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.

టిప్పర్, జేసీబీ సీజ్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తవ్వుతున్న టిప్పరు, జేసీబీని గాజుల మండ్యం పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రేణిగుంట మండలం పిల్లపాలెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో గురువారం రాత్రి 9:30 గంటలకు అక్రమంగా ఇసుక తవ్వుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వాహనాలను స్వాధీనం చేసుకొని జప్తు చేశారు.

బంగారు తిరుచ్చిపై దేవదేవుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం పురస్కరించుకుని గురువారం తెల్లవారిజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసులు తన దేవేరులతో కలసి బంగారు తిరుచ్చిపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్ బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్లు ధనశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే అధికారులు : జేసీ



సదస్సులో పాల్గొన్న జేసీ శుభం బన్సల్

శ్రీకాళహస్తి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. గురువారం తొట్టంబేడు మండలం పెద్దకనపర్తిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత

– వాడీవేడిగా గ్రామసభ



ఈఓను ప్రశ్నిస్తున్న వీఆర్ రావనన్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంటలో జరిగిన గ్రామసభలో పలు సమస్యలపై పంచాయతీ అధికారులను నిలదీశారు. రేణిగుంట మేజర్ పంచాయతీలో గురువారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముందుగా ఈఓ మణి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ఆ శాఖల అధికారులు గ్రామసభలో వివరించారు. పలు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రావనన్, వామపక్ష నేతలు సెల్వరాజ్, వెంకటరమణ, కుప్పయ్య, జనసేన నాయకులు గళమెత్తారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఈఓ దాటవేత ధోరణి అవలంబించారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు గ్రామసభకు చేరుకొని రోడ్డులో ఏర్పడిన గుంతలతో వాహనాలు దెబ్బతింటున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఆటోవాలాల నుంచి పంచాయతీ గేట్ వసూలు చేయడంపై అధికారులపై మండిపడ్డారు. ఈఓ గేటు వసూళ్లపై పరిశీలిస్తామని సమాధానమిచ్చారు. ప్రధానంగా పంచాయతీలో పెట్టిన బిల్లుల అవకతవకలు, అంతర్గత రహదారుల్లో ఏర్పడిన గుంతలు, పారిశుద్ధ్య లోపంపై గ్రామసభలో అధికారులను నిలదీశారు. గందరగోళం మధ్య గ్రామసభ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రాజు, వార్డు సభ్యులు రాజేష్, వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం



రేణిగుంట : శిక్షణకు హాజరైన ఎస్ఎంసీ చైర్మన్లు

సత్యవేడు : పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని ఎంఈఓ రవి పేర్కొన్నారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని అబ్జర్వర్ కస్తూరయ్య పర్యవేక్షించారు. శిక్షణలో సెల్‌ఫోన్ వినియోగం విద్యార్థులపై దుష్ప్రభావం, విద్యార్థుల అనుచిత వేషధారణ, బాలికలపై అసభ్య ప్రవర్తన, పాఠశాలల విద్యార్థుల రక్షణ భద్రత, సామాజిక తనిఖీ, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. రిసోర్సు పర్సన్‌లుగా భారతి, మనోహర్, గురునాథం, కిరణ్, సురేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉషా, 67 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

నాగలాపురం : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో గురువారం ఎంఈఓ బాబయ్య ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ అబ్జర్వర్‌గా వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్ అధికారి రమేష్, ఎస్ఎంసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

రేణిగుంట : పాఠశాల వసతులను అభివృద్ధి చేయడంలో ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) లదే ప్రధాన భూమిక అని రేణిగుంట ఎంఈఓ ఇందిరాదేవి పేర్కొన్నారు. రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని 66 మంది ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. పాఠశాల విద్య, వసతుల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర, పిల్లలు హాజరు, డ్రాపౌట్ల నియంత్రణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రెనింగ్ అబ్జర్వర్ హేమమాలిని, రిసోర్స్ పర్సన్ పుణ్యప్రసాద్, నరసింహులు, సునీతగౌడ్, నీలకంఠయ్య పాల్గొన్నారు.



సత్యవేడు : మాట్లాడుతున్న ఎంఈఓ రవి



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్ఎంసీ చైర్మన్

మారేడు కాలువ ఆక్రమణలు తొలగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని గోవర్ధనపురంలోని మారేడు కాలువ ఆక్రమణలను తక్షణమే తొలగించాలని స్థానికులు యుగంధర్‌రెడ్డి, పవన్‌కుమార్, పురుషోత్తమ్ తహసీల్దార్‌కు రెవెన్యూ సదస్సులో విన్నవించారు. అలాగే వరదయ్యపాళెం టౌన్‌లో శ్రీకాళహస్తి-తడ ప్రధాన రోడ్డు మార్గంలో ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఈఓ బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్లను ఎంఈఓ రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, మండల అధ్యక్షుడు రామచంద్రయ్య ఆవిష్కరించారు.